KANCHARLA
# మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
## అమరావతి
| | | |
|---|---|---|
| ఎన్టీఆర్ | కృష్ణా | గుంటూరు |
| పల్నాడు | బాపట్ల | ప్రకాశం |

బుధవారం 15 ఏప్రిల్ 2026 పేజీలు : 8



## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా..
# టిడిపి వ్యూహాత్మక సామాజికం

- బిసీ నాయకత్వం కోసం మేధోమధనం
- బిసీ నేతలతో సాధికారక కమిటీలు
- పాత జిల్లా నుంచి రాష్ట్ర కమిటీ
- ప్రతి పార్లమెంట్ జిల్లా నుంచి 14 మంది చొప్పున ఎంపిక
- 25 జిల్లానుంచి 14 మంది చొప్పున 350 మంది ఎంపిక




**అమరావతి, పొలిటికల్ బ్యూరో (మనసులో మాట)**

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా అధికార తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మక రాజకీయానికి పూనుకుంది. మున్సిఫల్ ,పంచాయితీ ఎన్నికలను త్వరగా నిర్వహించాలన్న భావనతో ఉన్న కూటమి సర్కార్ అందుకనుగుణంగా చర్యలు తీసుకొంటోంది. ఇప్పటికే ప్రతేక అధికారుల పాలనలోకి వెళ్ళిన నేపథ్యంలో త్వరితగతిన ఎన్నికలు నిర్వహించి రాజకీయ నిరుద్యోగ సమస్యలను కొంత వరకు తీర్చాలన్న పట్టుదలతో ఉంది. ఈనేపథ్యంలో సామజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికలలంటేనే టిడిపి వ్యూహాత్మకంగా ముందుకు వెళుతుందనటంలో ఏ మాత్రం సందేహం లేదు. ఎన్నికలకు ఆరు మాసాల ముందునుంచే కేడర్‌ను సమాయత్తం చేస్తుంది. ఇప్పటికే మంగళగిరిలో ఒక్కొక్క నియోజకవర్గం నుంచి కస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో ఏ విధంగా ఓటర్లను కలవాలి అనే అంశాలే కాకుండా వారిని తమ వైపు ఆకర్షించుకునే విధంగా వ్యవహరించాలని సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రాజకీయాలు పోటీ తత్వంలో నడుస్తున్నాయి. ప్రధానంగా కులాల కుంపటిలో కొట్టుకుంటున్నాయి. పై కులమతాలకు అతీతమని చెపుతోన్న వారిలో అధిక శాతం ఈ ఫార్ములాను పాటిస్తున్నారు. ఈనేపధ్యంలో జరుగతోన్న పరిణామాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మక సామాజికాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆధునిక రాజీకీయం సామాజిక(కుల) వర్గాల వారీగా విడిపోయిన నేపథ్యంలో ఆదిశగా అడుగులు వేసి వ్యూహాత్మకంగా తమ వైపు తిప్పుకునే భావనతో మోస్టు బ్యాక్ వర్డు క్లాస్ (ఎంబీసీ)సమావేశాలు సార్వత్రిక ఎన్నికల ముందు నిర్వహించింది. ఈస్టాటజీని ఇప్పుడు అమలు చేయాలన్న భావనలో ఉంది. 14 మందితో రాష్ట్ర కమిటీ రాష్ట్రంలోని అన్నీ అంశాలను పరిగణలోకి తీసుకుని నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్న అనేక మందిని ఎంపిక చేసి వారిని కమిటీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర కమిటీని - మిగతా వార్త 2లో



### ఏటూరు వెళ్లే దారికి అడ్డంగా గండి..
## ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు!

**పల్నాడు, ఏప్రిల్ 14,( మనసులో మాట):** దిడుగు–ఏటూరు వెళ్లే పడవ ప్రయాణికులకు దారి కష్టాలు మొదలయ్యాయి. లంక భూముల్లోని ప్రభుత్వ దారికి గుర్తు తెలియని వ్యక్తులు అడ్డంగా గండి కొట్టడంతో రాకపోకలు స్తంభించాయి. ఏప్రిల్ 8న జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పడవ పాటలు నిర్వహించినప్పటికీ, ప్రయాణికుల సౌకర్యాలను మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాదిమంది ప్రయాణికులు రైతులు ప్రజలు ఏటూరు నుంచి దిడుగు గ్రామం అమరావతి వెళ్తుంటారని స్థానిక ప్రజలు తెలిపారు. సుమారు 20 ఎకరాల లంక భూముల్లో వ్యవసాయ కూలీలు పనులు నిమిత్తం వెళ్తారని వారికి ఇబ్బందికరంగా ఉందన్నారు. ప్రజా సౌకర్యార్థం అధికారులు స్పందించి దారిని పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరారు.



## అభివృద్ధిపై చర్చకు సిద్ధం- ఆర్తి మల్ల

**పల్నాడు, ఏప్రిల్ 14, (మనసులో మాట):** టిడిపి హయాంలో జరిగిన అభివృద్ధిని తమ ఖాతాలో వేసుకోవడం మాజీ ఎమ్మెల్యే శంకరరావు కు తగదని పల్నాడు జిల్లామాజీ టిడిపి కార్యదర్శి ఆర్తిమల్ల రమేశ్ విమర్శించారు. మంగళవారం పెదకూరపాడు లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 ముందు కొమ్మాలపాటి శ్రీధర్ హయాంలోనే గ్రామాల్లో 70% సి సి రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని గుర్తు చేశారు. అప్పట్లో తాము చేపట్టిన అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా చూపేందుకు, చర్చలకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. నేడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వంద రోజులు 100 గ్రామాల కార్యక్రమం చేపట్టి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య, జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్, బీసీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు మాజీ ఎంపీపీ గల్లా బాబురావు మోదుగుల చంద్రశేఖర్, కంచర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసమానతలు లేని
## సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారు
**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ**



**పల్నాడు,ఏప్రిల్ 14,( మనసులో మాట):** సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కన్న అంబేద్కర్ ,తీవ్ర వివక్ష, అసమానతలను ఎదొర్కొని ఉన్నత చదువులు చదివి ప్రపంచమేధావిగా ఎదిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. మంగళవారం నాడు ఆమె డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకొని నరసరావుపేట లోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కలలు కన్నారని ప్రజలందరూ ఉన్నత చదువులు చదివి జ్ఞానం సంపాదించడం ద్వారా ఈ దేశం అభివృద్ధి చెందుతుందని, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు న్యాయం జరగాలంటే అన్ని రంగాలలో దళితులకు, బలహీన వర్గాలకు, మహిళలకు రిజర్వేషన్లు అవసరమని భావించారని, అందరికీ ఓటు కల్పించడం, ప్రజాస్వామ్య పరిపాలనలో అందరూ భాగస్వామ్యం అవ్వాలని భారత రాజ్యాంగంలో అనేక హక్కులు పొందుపరిచారని అన్నారు. నేటి పాలకులు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి మనువాదాన్ని ప్రవేశ పెట్టడానికి కుట్రలు చేస్తున్నారని, ప్రజాస్వామ్య వాదులు లౌకిక శక్తులు యావత్ దేశ ప్రజలందరూ భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. గతంలో రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కులను బౌద్ధులను రిజర్వేషన్లకు అర్హులుగా చేర్చడం జరిగిందని, కానీ ఇటీవల సుప్రీంకోర్టు దళిత క్రైస్తవులను రిజర్వేషన్ పొందటానికి అర్హత లేదని తీర్పు చెప్పడం అన్యాయమని, రాజ్యాంగాన్ని సవరణలు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించే విధంగా చేయాలని అన్నారు. ఇటీవల కాలంలో దేశంలో దళితులు, క్రైస్తవులు, ముస్లింలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని తక్షణమే వాటిని నివారించడానికి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో కూడా డిప్యూటీ స్పీకర్ గా ఉన్న రఘురామకృష్ణమరాజు రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగాన్ని అమలు చేస్తామని, దేశ సార్వభౌమాత్వాన్ని కాపాడతామని ప్రమాణం - మిగతా వార్త 2లో



### సామాన్యుని ఆకలి వెతికే చిరునామా
## అన్నా కాంటీన్
**- మాగులూరి భానుప్రకాష్**

**పల్నాడు, ఏప్రిల్ 14, (మనసులో మాట):** అన్నదాతా సుఖీభవ.. ఇది మన సజీవ తెలుగు సంస్కృతి. మనిషి ఎంత గొప్పవాడైనా, ఎంతెత్తుకు ఎదిగినా జీవితంలో జయాపజయాలకతీతంగా తల వంచి, గౌరవించే అవసరం ఆకలి. పట్టణ ప్రాంతాలలో జీవితమే నిత్య పోరాటంగా సాగుతున్న ప్రతీ సామాన్యుడి ఆకలి తీర్చే తారక మంత్రం 'అన్నా కాంటీన్'. ఒక వైపు కృత్రిమ - మిగతా వార్త 2లో



## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నారు

**- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ**

- మొదటి పేజీ తరువాయి చేసి ఇప్పుడు వివిధ కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టి, వివక్షతను చూపిస్తున్నారని ఓట్ల రాజకీయమే దీనికి ప్రధాన కారణమని అన్నారు. రాజకీయాలు చేయదలచుకుంటే డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. క్రైస్తవ చర్చిలకు అనుమతులు ఉన్నాయో లేదో నోటీసులు జారీ చేయటం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని, ఏ మతం వారైనా మత ప్రచారం చేసుకోవచ్చుని, మతం అనేది వ్యక్తిగతం అని ఎవరిష్టం వచ్చినవారు ఆ మతాన్ని ఆచరించవచ్చని రాజ్యాంగంలో స్పష్టంగా చెప్పడం జరిగిందని అన్నారు. ఎప్పటికైనా కులమత ఘర్షణలు పెరగకుండా మతసామరస్యాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తే భవిష్యత్తులో మానవుల మధ్య మారణ హోమం జరిగే అవకాశం ఉందని తక్షణమే మత ఘర్షణలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్, గురజాల నియోజకవర్గ కార్యదర్శి రమణా రెడ్డి, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు కొమెర వెంకటరావు, నరసరావుపేట నియోజకవర్గ కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు, చిలకలూరిపేట నియోజకవర్గ కార్యదర్శి తాళ్లూరు బాబురావు,మహిళా సంఘం జిల్లా నాయకురాలు చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం.సుబ్బారావు, షేక్ సుభాని, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ,సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ముసునూరి రమేష్ బాబు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకపోతుల నాగేశ్వరరావు,బి.రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుని ఆకలి వెతికే చిరునామా అన్నా కాంటీన్

- మొదటి పేజీ తరువాయి మేధతో ప్రపంచం పరిగెడుతున్నా, పేదవాడి జీవన ప్రమాణాలను సంస్కరించటంలో, వారికి విద్య, వృత్తి నైపుణ్యం, ఉపాధి కల్పనలో ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటిస్తున్న చంద్రబాబు నాయుడి ప్రభుత్వంలో మరోవైపు మానవతా దృక్పథంతో , సామాన్యుడికి, పేదవారికి పట్టెడన్నం పెట్టే అన్నా కాంటీన్ల నిరంతర నిర్వహణ సర్వదా అభినందనీయం. కూడు,అన్నం గూడు, గుడ్డ అనే మనిషి సహజ అవసరాలను నిరంతర సంక్షేమం ద్వారా ఇంటింటికీ చేర్చాలన్న పార్టీ సిద్ధాంత కర్త అన్న ఎన్టీఆర్, కార్యాచరణలో నిత్య సాధకుడు అధినేత చంద్రబాబు నాయుడు. మన రాజధాని అమరావతిలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమన్వయంతో నేడు మరో అన్న కాంటీన్ ప్రారంభ కార్యక్రమానికి హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తూ, అభినందిస్తూ, విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి రాజధాని ప్రాంత ప్రవాస తెలుగు వారందరి తరపునా ఆత్మీయ స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం..

# అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చూపిన బాట ఆదర్శనీయం



**పల్నాడు, ఏప్రిల్ 14, (మనసులో మాట):** అనగారిన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన బాట ఆదర్శనీయమని బెల్లంకొండ మండల వైయస్సార్ పార్టీ కన్వీనర్ అన్నపురెడ్డి నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నపురెడ్డి నర్సిరెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు వివక్షకు గురవుతున్న కాలంలో సమ సమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. సమాజంలో అంటరానితనాన్ని ఆస్పృశ్యతను రూపుమాపేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదని, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన బాట ఆదర్శనీయమన్నారు. అంబేద్కర్ ఆశయాలను వైయస్ జగన్ కొనసాగిస్తున్నారని, అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారని, కూటమి ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.గత వైకాపా పాలనలో రెండు సంవత్సరాలు కరోనా గడ్డు కాలాన్ని ఎదుర్కొని తదుపరి మూడు సంవత్సరాలలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు పరిచిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దే నన్నారు. అనంతరం మీడియా సమావేశంలో పెదకూరపాడు నియోజకవర్గ కూటమి నాయకులు గత కొన్ని రోజులుగా పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నంబూరు శంకరరావు పై చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండిస్తూ గతంలో ఎన్నడూ లేనివిధంగా పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధి కోసం అత్యధిక నిధులు మంజూరు చేయించి అభివృద్ధిని ఆచరణలో పెట్టిన నాయకుడు నంబూరు శంకరరావే నని,అధికార పార్టీ నాయకులు నేటికీ ఒక పని చేయకుండా పదేపదే పనిచేసిన వారిపై బురద చల్లటం ఎంతవరకు సమంజసమో ప్రజలు గమనిస్తున్నారన్నారు . ఇదే విధంగా కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రజలు ఇచ్చే తీర్పుకు మీరు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైకాపా సీనియర్ నాయకులు బద్దూరి చంద్రా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి,వైస్ కన్వీనర్ మౌలాలి, మండల మహిళా కన్వీనర్ కంభంపాటి పాప, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గడిపర్తి బాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బడా బచ్చా, మండల రైతు కమిటీ అధ్యక్షుడు కారుమూరి భద్రయ్య,మండల యూత్ అధ్యక్షుడు నాగుల్ మీర , వైసిపి సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప విద్యావేత్త తత్వవేత్త రాజనీతి కోవిదులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



**పల్నాడు, ఏప్రిల్ 14,( మనసులో మాట):** గొప్ప విద్యావేత్త తత్వవేత్త రాజనీతి కోవిదులు మన దేశానికి గొప్ప రాజ్యాంగం అందించింది డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని బెల్లంకొండ ఎస్సై పి గోపి అన్నారు. బెల్లంకొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా ఎస్సై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో అందరం పునరాంకితమవుదామని ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేనని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అట్టడుగు వర్గాలకు సమానత్వం సాధించడం కోసం స్వేచ్ఛ సమానత్వాలను అందించే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ఆచరణ మనకు మార్గదర్శకం అన్నారు. భారతదేశ రాజ్యాంగానికి ఉన్నటువంటి గొప్పదనం మరే దేశ రాజ్యాంగానికి లేదన్నారు. గొప్ప విద్యావంతుడిగా లండన్ ఎకనామిక్స్ స్కూల్లో చదువుకొని ఆర్థిక శాస్త్రంలో పీహెచ్ డి పట్టా అందుకున్న మహోన్నత వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని ఆయన కొనియాడారు. సమానత్వము సమ సమాజం కావాలని అందరూ స్వేచ్ఛగా సౌభ్రాతృత్వంతో బ్రతకాలనే లక్ష్యంతో ఆయన రాజ్యాంగాన్ని అందించారన్నారు. నేడు అట్టడుగు వర్గాలకు న్యాయం జరుగుతుందంటే ఆయన ఇచ్చిన రాజ్యాంగం వల్లనే అని,అందరికీ సమాన ఓటు హక్కును ఇచ్చి ప్రభుత్వాలు సరిగా పనిచేయకపోయినా ఐదు సంవత్సరాలకు ఒకసారి వారిని గద్దె దించేలా మరొకరిని ఎన్నుకునేలా ప్రజల చేతుల్లోనే అధికారం పెట్టారని అదే ప్రజాస్వామ్యమని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలలో భారత దేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగంగా ఘనతకి ఎక్కిందని ప్రశంసించారు. స్టేషన్ సిబ్బంది, నామాల బ్రహ్మనాయుడు, అచ్చయ్య, కృపారావు, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా..

# టిడిపి వ్యూహాత్మక సామాజికం

- మొదటి పేజీ తరువాయి ఆర్గనైజ్ చేస్తున్న పార్టీలోని బీసీ నేతలు ఉమ్మడి 13 జిల్లాల నుంచి ఒక్కొక్కరిని తీసుకుని మొత్తం 14 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తున్నారు.

**పార్లమెంటుకు జిల్లా కమిటీలు ఏర్పాటు:**

బీసీలనే లక్ష్యంగా చేసుకుని లీడర్‌ను తయారు చేయాలన్న భావనతో ఉన్న టిడిపి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంనుంచి ఒక జిల్లా కమిటీని ఎంపిక చేస్తున్నారు. వీటిలో పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి జిల్లా కమిటీని తయారు చేస్తారు. నియోజకవర్గాలలలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశాలు:

స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా నియోజకవర్గం వ్యాప్తంగా బీసీల సదస్సులు నిర్వహించాలన్న పట్టుదలతో పార్టీ అది నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశాలు పార్టీ రహితంగా నిర్వహించాని తలపెట్టిన టిడిపి 5 జోన్లుగా విభజించారు. 5పార్లమెంట్,వాటి పరిధిలోని సుమారు 35 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీసీలు హాజరయ్యే విధంగా సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పోల్ మేనేజ్ మెంటుకు వర్కుషాపును నిర్వహించాల్సి ఉంది.. వీటన్నింటీ వివిధ రాకాలుగా ప్రచారం చేయడానికి సోషల్ మీడియాను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన వారు విమర్శలు చేసి నప్పుడు వారికి ఏ విధంగా కౌంటర్లు ఇవ్వాలనేది పార్టీ సూచన చేస్తుంది .దానికి అనుగుణంగా ప్రతి విమర్శ చేయాలి.ఇలా అనేక రకాలుగా బీసీలను దగ్గరకు తీసుకునే విధానంలో భాగంగా వారికి పదవుల పందేరాన్ని కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలుసోంది. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా బీసీలను వ్యూహాత్మకంగా దగ్గరకు తీసుకోవాలన్న భావనతో తెలుగుదేశం అనేక ప్రణాళికలు రచిస్తుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.